నేడు హైదరాబాద్‌లో డివి కృష్ణ వర్ధంతి సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విప్లవోద్యమ నేత, శ్రామికవర్గ యోధుడు, ప్రజాపంథా రాష్ట్ర మాజీ కార్యదర్శి డివి కృష్ణ మూడో వర్ధంతి సభ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఈ మేరకు సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డివి కృష్ణ వర్ధంతి సభ సందర్భంగా 'పతనం వైపు పెట్టుబడిదారీ విధానం-ఫాసిస్టు విధానాలు' అనే అంశంపై ఆర్థికవేత్త డి పాపారావు, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెజి రాంచందర్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభకు మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రమ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు.

మోడీ ఇచ్చిందేమిటి?

- న్యూయార్క్, సింగపూర్‌తోనే హైదరాబాద్ పోటీ
- మూసీకి ఎందుకు నిధులు ఇవ్వలేదో కిషన్‌రెడ్డి చెప్పాలి
- డిసెంబర్ 9లోపు విజన్ డాక్యుమెంట్
- నగరానికి అవతల డీజిల్ బస్సులు.. లోపల మూడు వేల ఎలక్ట్రిక్ బస్సులు
- గచ్చిబౌలి భూములపైన న్యాయ పోరాటం
- గచ్చిబౌలిలో పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో రేవంత్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సిఎం, పక్కన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుజరాత్‌కు సబర్మతి, ఢిల్లీకి యమున, ఉత్తరప్రదేశ్‌కు గంగాను ఇచ్చిన ప్రధాని మోడీ హైదరాబాద్‌కు ఏమిచ్చారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు కేంద్రం ఎందుకు నిధులు ఇవ్వడం లేదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, ముంబయితో పోటీ కాదని న్యూయార్, టోక్యో, సింగపూర్‌తో పోటీ పడతామని తెలిపారు. డిసెంబర్ 9లోపు తెలంగాణ విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామని ప్రకటించారు. రాజకీయ ముసుగులో ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకునే వారిని క్షమించబోమన్నారు. మూడు లేయర్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని విభజించాలని అనుకున్నామని, వంద రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతాయని తెలిపారు. స్ట్రాటజిక్ రోడ్డు డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.182.72కోట్లతో రంగారెడ్డి జిల్లా కొండాపూర్ నుంచి ఔటర్ రింగు రోడ్డు వరకు 1.2 కిలోమీటర్ల పొడవు, 24మీటర్ల వెడల్పుతో నిర్మించిన ఆరులైన్ల ఫ్లైఓవర్‌ను (పీజేఆర్ ఫ్లైఓవర్) శనివారం సిఎం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే వందేండ్ల నగర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రోడ్ల వెడల్పు, అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్లు నిర్మించబోతున్నామని తెలిపారు. డీజిల్ బస్సులతో హైదరాబాద్‌లో కాలుష్యం పెరుగుతోందని, వాటిని జిల్లాలకు తరలించామన్నారు. నగరంలోకి మూడువేల ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తున్నట్టు చెప్పారు. ఆటోల కొనుగోలుపైనా నిషేధాన్ని తొలగించి ఎలక్ట్రికల్, సిఎన్‌జి ఆటోలకు అనుమతి ఇస్తున్నామన్నారు. పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజ్‌లా ఉండేదన్నారు. పిజెఆర్ పోరాటం వల్లనే నగరానికి కృష్ణాజలాలు వచ్చాయని అన్నారు. హైటెక్ సిటీ మహారాష్ట్రకు తరలిపోకుండా పిజెఆర్ పోరాడినట్టు గుర్తు చేశారు. తెలంగాణలో 65 శాతం ఆదాయం హైదరాబాద్ నగరం నుంచే వస్తోందన్నారు. నగర అభివృద్ధికి కొందరు అవాంతరాలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు ప్రకటించారు. గచ్చిబౌలి భూముల్లో ఐటీ కంపెనీలు తీసుకొచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పించాలని ప్రయత్నిస్తే.. అభివృద్ధి నిరోధకులు అడ్డుకున్నారని ఆరోపించారు. గచ్చిబౌలి భూములపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో నాలాల కబ్జాల కారణంగా వర్షపు నీరు రోడ్లపైకి వస్తోందన్నారు. హైడ్రాతో ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రభుత్వం తొలగించిందని గుర్తు చేశారు. హీరో నాగార్జున స్వయంగా ఎన్ కన్వెన్షన్‌కు చెందిన రెండెకరాలు ప్రభుత్వానికి అప్పగించి సహకరించారన్నారు.

30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని సిఎం తెలిపారు. ప్రపంచం అంతా భారత్ ఫ్యూచర్ సిటీ వైపు చూస్తోందని అన్నారు. మన్మోహన్‌సింగ్, జైపాల్ రెడ్డితో హైదరాబాద్‌కు మెట్రో, పీవీ నరసింహారావుతో ఐటీ వచ్చిందన్నారు. ప్రధాని మోడీ వల్ల హైదరాబాద్ నగరానికి ఏమీ రాలేదన్నారు. బెంగళూరు, చెన్నై, ఏపీకి మెట్రో రైల్ ఇచ్చారు.. గుజరాత్‌కు బుల్లెట్ ట్రైన్ ఇచ్చారన్నారు. హైదరాబాద్ నగరానికి వస్తున్న అమిత్ షాను కలిసి మెట్రోకు, ట్రిబుల్ ఆర్‌కు, మూసీకి అనుమతులు ఇవ్వాలని కోరుతామని తెలిపారు. మెట్రోలో తెలంగాణ తొమ్మిదో స్థానానికి దిగజారిందని.. ఇది కిషన్‌రెడ్డికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎవరు కుట్రలు చేస్తున్నారో, ఎవరు అభివృద్ధి చేస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుందని, శేరిలింగంపల్లి నాలుగు నియోజకవర్గాలుగా అయ్యే అవకాశం ఉందన్నారు. పేదలకు అండగా నిలిచిన పీజేఆర్ విగ్రహం ఏర్పాటు కోసం సరైన స్థలాన్ని గుర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల, విజయలక్ష్మి, సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ భూ సేకరణ వేగవంతం చేయండి

ఫ్యూచర్ సిటీ భూ సేకరణను తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో పరిశ్రమల శాఖపై మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్షించారు. ఫ్యూచర్ సిటీ భూ సేకరణ, పెట్టుబడులు తదితర అంశాల పురోగతిపై ఈ సందర్భంగా అధికారులను సిఎం అడిగి తెలుసుకున్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలనీ, వాటికి కావాల్సిన స్థలాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పెట్టుబడుల కోసం రాష్ట్రానికి వచ్చే పారిశ్రామిక వేత్తలు వెనక్కి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిమ్జ్‌లో మిగిలి ఉన్న భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ ఏర్పాటు చేయాలనీ, అందుకు గాను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఆర్కిటెక్చర్లను నియమించుకోవాలని ఆదేశించారు. అందులో క్రికెట్, ఫుట్‌బాల్, గోల్ఫ్ వంటి అన్ని క్రీడలు ఉండేలా ప్లాన్ చేయాలన్నారు. ఈ మెగా ప్రాజెక్ట్‌పై మంత్రి వర్గ ఉపసంఘం ప్రతీ 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై చర్చించాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

రాజ్యాంగ వ్యవస్థల ధ్వంసం

- ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో బిజెపి ప్రభుత్వ పాలన
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ ఆ ప్రజాస్వామిక పాలన కొనసాగిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పాలన సాగిస్తోందన్నారు. రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన సెక్యులర్ సోషలిజం అనే పదాలను తొలగించాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని నాశనం చేయాలన్నది ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమన్నారు. తన ఎజెండాకు అనుగుణంగా దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలని యత్నిస్తోందన్నారు. స్వాతంత్ర్యోద్యమంలోఎలాంటి పాత్ర పోషించని ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను తొలగించాలని చూస్తోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి బిజెపి చేసే ఇటువంటి ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని బిజెపి రాజకీయంగా ఉపయోగించుకొని దేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధ పరిణామాలను ప్రజలకు వివరించడం లేదన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు, ఆదివాసీలు, దళితులపై దాడులు దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముగాస్తూ పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా పరిపాలన చేస్తున్న మోడీ విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల జ్యోతి, వీరబోయిన రవి ఉన్నారు.

పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలనకు నేడే ఆఖరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ధ్రువపత్రాల పరిశీలనకు ఆదివారం వరకే గడువున్నది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం ఒక విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఆదివారంతో ముగియనుందని తెలిపారు. వెబ్‌ఆప్షన్ల నమోదుకు వచ్చేనెల ఒకటో తేదీ వరకు అవకాశముందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 17,699 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. 8,528 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. వచ్చేనెల నాలుగో తేదీన పాలిసెట్ ప్రవేశాలకు సంబంధించి తొలివిడత సీట్లను కేటాయిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

బ్లాక్‌చైన్ టూర్ స్పాన్సర్‌గా బైబిట్

హైదరాబాద్ : బ్లాక్‌చైన్ టూర్ 2025కు టైటిల్ స్పాన్సర్‌గా తమ సంస్థ ఎంపికయ్యిందని బైబిట్ ఇండియా హెడ్ వికాస్ గుప్తా తెలిపారు. ఇది భారత వెబ్3 విప్లవానికి బలం చేకూర్చనుందన్నారు. ఈ టూర్ జూన్ 28న హైదరాబాద్‌లో ప్రారంభమై.. నవంబర్ 30న బెంగుళూరులో ముగుస్తుందన్నారు. ఇందులో క్రిప్టోపై అవగాహన ఉంటుందన్నారు. ఈ టూర్‌లో ప్రధాన కార్యక్రమం మెటామార్ఫోసిస్ సెప్టెంబర్ 27-28 తేదీలలో న్యూఢిల్లీలో జరగనుందన్నారు.

వైద్యారోగ్యశాఖలో 607 పోస్టులకు నోటిఫికేషన్

హైదరాబాద బ్యూరో : వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి మరో నోటిఫికేషన్ విడుదలైంది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండ్రోజుల క్రితమే డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ థెరపిస్ట్ పోస్టులకు బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకుగానూ జులై 10 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో గడచిన 17 నెలల్లో ఎనిమిది వేలకు పైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 1,931 మల్టి పర్పస్ ఫీమెల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇప్పటికే ఆయా పోస్టుల ఫలితాలు విడుదలయ్యాయి. మెరిట్ జాబితాలు సిద్ధమైతున్నాయి.

ఉచితంగా డేటా ఇంజనీర్ కోర్సు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఉచిత డేటా ఇంజనీర్ కోర్సును అందిస్తోన్నట్లు తెలిపింది. ఈ కోర్సుకు 2022-2025 మధ్య బిఎస్‌సి, ఎంఎస్‌సి, బిటెక్, ఎంటెక్, ఎంసిఎ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హులని ఆ సంస్థ పేర్కొంది. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో 90 రోజుల పాటు తరగతులు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని తెలిపింది. ఆసక్తి కలిగిన వారు 9052372023కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొంది.

సమ ఆహారంతోనే కొలెస్ట్రాల్ నియంత్రణ

హైదరాబాద్ : గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను నివారించడానికి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం అత్యంత కీలకమని న్యూఢిల్లీలోని మాక్స్ హెల్త్‌కేర్‌లో డైటెటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్ పేర్కొన్నారు. కొలెస్ట్రాల్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి సమతుల ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాదం, ఓట్స్, తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి ఆహారాలను డైట్ లో చేర్చుకోవడం కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడం వీలవుతుందన్నారు. ఆహారంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా చాలా అవసరమన్నారు.

అక్రిడిటేషన్ల గడువు పెంపు ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో వర్కింగ్ జర్నలిస్టులకు జారీ చేసిన అక్రిడిటేషన్ల గడువు చెల్లింపును మరో మూడు నెలల పాటు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ప్రస్తుతం ఉన్న అన్ని రాష్ట్ర, జిల్లా జర్నలిస్టుల అక్రెడిటేషన్ల గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది. ఈ మేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్.ప్రియాంక తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా అక్రిడిటేషన్ల గడువు పొడిగించడం ఇది ఐదో సారి. అక్రిడిటేషన కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం తాజా మార్గదర్శకాలతో ఆదేశాలు జారీ చేయాల్సి ఉందనీ, ఆ ఆదేశాల జారీ తర్వాత వర్కింగ్ జర్నలిస్టుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు తెలిపారు.

షేక్‌పేట గురుకుల హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాన్న.. ఇక్కడ ఉండలేను.. ఇంటికి వస్తాను.. వచ్చి తీసుకెళ్లు అని ఫోన్ చేసి తండ్రికి చెప్పిన కొడుకు మరుసటి రోజే హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన మహిపాల్‌కు ప్రభాస్(17) ఒక్కగానొక్క కొడుకు. అతను గోల్కొండ సమీపంలోని అల్కాపూర్ రోడ్డులో ఉన్న షేక్‌పేట్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ ఎంపిసి చదువుతున్నాడు. అక్కడే హాస్టల్ ఉంటున్నాడు. తనకు ఇక్కడ ఉండటం ఇష్టం లేదని, వచ్చి తీసుకెళ్లాలని వరుసగా మూడ్రోజులు తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. శుక్రవారం తండ్రి రావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల రాలేకపోయాడు. ఇంతలోనే శనివారం ఉదయం ప్రభాస్ తన హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న గోల్కొండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గంటల్లోనే పరిష్కారం చూపిన హైడ్రా

- జీడిమెట్ల పార్కులో ఆక్రమణల తొలగింపు
- పార్కు ప్రొటెక్టెడ్ బై హైడ్రా బోర్డు

హైదరాబాద బ్యూరో : పార్కులో ఆక్రమణలపై స్థానికులు ఫిర్యాదు చేసిన మూడు గంటల్లోనే హైడ్రా పరిష్కారం చూపింది. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీలోని జీడిమెట్ల గ్రామం సర్వే నెంబర్ 218, 214లో ఉన్న రుక్మిణి ఎస్టేట్స్‌కు చెందిన పార్కును కాపాడింది. 1200 గజాల పార్కు ఉంటే తప్పుడు పత్రాలతో సగానికి పైగా కబ్జా చేశారు. ఈ కబ్జాలు తొలగించాలని కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ముందు రుక్మిణి ఎస్టేట్స్ రెసిడెన్షియల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. అనంతరం హైడ్రా కార్యాలయానికి వచ్చి కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు ఫోన్ చేసి.. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని సూచించారు. మధ్యాహ్నం ఫిర్యాదు అందగా సాయంత్రానికే మున్సిపల్ సిబ్బందితో కలిసి హైడ్రా రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించింది. వెంటనే రాత్రికి రాత్రే పార్కు ప్రహరీ నిర్మించింది. శనివారం ఉదయం వేకువ జామునే పార్కులోకి వచ్చిన స్థానికులు.. పార్కు ప్రొటెక్టెడ్ బై హైడ్రా బోర్డును చూసి సంతోషించారు. హైడ్రా చర్యలను అభినందించారు.

దోస్త్ మూడోవిడతలో 85,680 మందికి సీట్ల కేటాయింపు

- సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు 30



ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిఎస్‌డబ్ల్యూ, బిబిఎ, బిసిఎ, బిబిఎం కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడో విడత సీట్లను ఉన్నత విద్యామండలి కేటాయించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ వి బాలకృష్ణారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దోస్త్ మూడో విడతలో 82,770 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మూడో విడతలో మొత్తం 96,015 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. వారిలో 85,680 మందికి సీట్లు కేటాయించామని వివరించారు. మొదటి ప్రాధాన్యతద్వారా సీట్లు పొందిన విద్యార్థులు 64,181 మంది ఉన్నారని తెలిపారు. రెండో ప్రాధాన్యత, ఇతర ప్రాధాన్యత ద్వారా సీట్లు పొందిన వారు 21,499 మంది ఉన్నారని పేర్కొన్నారు. మొదటి, రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు మూడో విడతలో మెరుగైన కాలేజీ, కోర్సు కోసం వెబ్‌ఆప్షన్లను చేశారని తెలిపారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం వల్ల 10,335 మందికి సీట్లు కేటాయించలేదని తెలిపారు.

కామర్స్‌లో 35,402 మందికి సీట్ల కేటాయింపు

దోస్త్ మూడో విడతలో కామర్స్‌లో 35,402 మందికి సీట్లు కేటాయించామని బాలకృష్ణారెడ్డి, శ్రీదేవసేన పేర్కొన్నారు. ఫిజికల్ సైన్సెస్‌లో 20,890 మంది, లైఫ్ సైన్సెస్ (జీవ శాస్త్రాలు)లో 16,099 మంది, ఆర్ట్స్‌లో 13,128 మంది, ఇతర కోర్సుల్లో 161 మంది కలిపి మొత్తం 85,680 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. ఎస్‌ఎంఎస్ ద్వారా విద్యార్థులకు సమాచారం అందించామని తెలిపారు. సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా సీటును రిజర్వు చేసుకోవాలని సూచించారు. దోస్త్ లాగిన్‌లో విద్యార్థులు రూ.500 లేదా రూ.వెయ్యి చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు ఈనెల 30 వరకు ఉందని తెలిపారు. దోస్త్ రెండో విడతలో సీటు పొంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థికి మూడో విడతలో సీటు వస్తే ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటును రిజర్వు చేసుకోవాలని కోరారు. రెండో విడతలో వచ్చిన సీటు రద్దవుతుందని పేర్కొన్నారు. మూడో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు వచ్చేనెల ఒకటో తేదీ వరకు రిపోర్టు చేయాలని తెలిపారు. ఒకవేళ రిపోర్టు చేయకుంటే ఆ సీటును కోల్పోతారని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https:// dost. cgg. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సాంకేతికంగా జూరాల భద్రం

- నాలుగు గేట్లలో రోప్‌వే సమస్య
- గత ప్రభుత్వంలో నిర్వహణలేని ప్రాజెక్టులు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూరాల ప్రాజెక్టు సాంకేతికంగా పూర్తి భద్రంగా ఉందని, ప్రతి నీటిపారుదల ప్రాజెక్టునూ పూర్తి సామర్థ్యంతో వినియోగించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నదని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు గేట్ల వద్ద రోప్‌వే సమస్య ఏర్పడిన నేపథ్యంలో శనివారం పశు సంవర్థక, యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్‌ను ఉత్తమ్ సందర్శించారు. జూరాల గేట్ల వద్ద ఏర్పడిన సమస్యలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు 62 గేట్లలో 58 గేట్లు నిర్విరామంగా పని చేస్తున్నాయని, తాత్కాలికంగా నాలుగు గేట్లకు రోప్‌వే సమస్య తలెత్తినప్పటికీ, దాని వల్ల ఎలాంటి ప్రమాదమూ లేదని తెలిపారు. గతంలో ఎన్నో భారీ వరదలను జూరాల డ్యామ్ ఎదుర్కొందని, ఇప్పుడు ప్రభుత్వం పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.దశాబ్ద కాలంలో రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రస్తుతం పాత తప్పిదాలను సరిచేసే దిశగా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఇరిగేషన్‌లో ఆపరేషన్ మెయింటెన్స్ పట్ల ప్రత్యేక దృష్టి సారించి, ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జూరాల డ్యాంపై నుంచి భారీ వాహనాలు వెళ్లడాన్ని గతంలోనే నిషేధించేలా సాంకేతిక నివేదికలు ఇచ్చినప్పటికీ, గత ప్రభుత్వ పాలనలో పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు సమస్య తీవ్రతను గుర్తించి, జూరాల ఆవరణలో అల్టర్నేట్ రోడ్, వాహనాల వంతెన కోసం రూ.100 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. జూరాల, మంజీరా, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులన్నింటికీ రొటీన్ మెయింటెనెన్స్ చేపట్టి భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

పూర్తిగా రీస్టోర్..

జూరాల ప్రాజెక్టును పూర్తిగా రీస్టోర్ చేసి, వాటి సామర్థ్యాన్ని పెంచే దిశగా డిసిల్టేషన్, సెడిమెంటేషన్ తొలగింపు పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ర్యాలంపాడు రిజర్వాయర్ సామర్థ్యాన్ని నాలుగు టీఎంసీల వరకు పెంచేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రెండు టీఎంసీల వరకు మాత్రమే నీరు నిల్వ అవుతోందని, మిగతా రెండు టీఎంసీల సామర్థ్యం అమలైతే రైతులకు లాభం చేకూరుతుందని అన్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు భూసేకరణ పనులు వేగవంతం చేయడమే కాకుండా, జూరాల ఎడమ కాలువ ద్వారా ర్యాలంపాడు రిజర్వాయర్ పనులను త్వరితంగా పూర్తి చేస్తామని తెలిపారు. నెట్టెంపాడు భూసేకరణ కోసం ఇప్పటికే రూ.25 కోట్లు విడుదల చేశామని, డిసెంబర్ 2025 లోపల 100శాతం పూర్తి చేస్తామని చెప్పారు.

అసత్యాల్ని నమ్మొద్దు: మంత్రి వాకిటి

జూరాల ప్రాజెక్టు ఒడిదుడుకులు వచ్చినా తట్టుకుని నిలబడిందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. 2009లో వచ్చిన భారీ వరదల సమయంలోనూ రోజుకి 12 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, అయినా ప్రాజెక్టు ఏమాత్రం నష్టాన్ని ఎదుర్కోలేదన్నారు. కొంతమంది కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి అసత్యాల్ని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రాంతం సస్యశ్యామలం : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

జూరాల ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారింది. సాగునీటి లభ్యత పెరిగింది. ర్యాలంపాడు ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచేందుకు రెండు నుంచి నాలుగు టీఎంసీల నీటిని నిల్వ చేసే పనులను వేగవంతం చేయాలి. జూరాల ప్రాజెక్టు పైనుంచి భారీ వాహనాలు వెళ్లకుండా రాకుండా రోడ్డుకు బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు.

నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు : రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

కర్నాటక రాష్ట్రంతో సమన్వయం జరిపి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగిస్తే నీటి నిల్వ సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉందని చిన్నారెడ్డి అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బియం.సంతోష్, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఇంజినీర్-ఇన్-చీఫ్ ఓ అండ్ ఎం.శ్రీనివాస్, డ్యామ్ సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ టి.ప్రమీలా, వనపర్తి చీఫ్ ఇంజినీర్ ఏ.సత్యనారాయణ రెడ్డి, గద్వాల సూపరింటెండింగ్ ఇంజినీర్ రహీం ఉద్దీన్ ఉన్నారు.

జూడాల సమ్మెకు ఐఎంఎ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు ఐఎంఎ జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ మద్దదతు తెలిపింది. ఈ మేరకు శనివారం ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.ద్వారకానాథ్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ వి.అశోక్ తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చెందిన జూడాలు ఈ సమ్మె చేయబోతున్నారని తెలిపారు. జూడాల సమస్యలు, డిమాండ్ల పట్ల ఒక నిర్మాణాత్మక పరిష్కారం లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

కవితను కలవడంలో రాజకీయ ప్రాధాన్యత లేదు

- సిపిఐ ఎంపీ సంతోష్‌కుమార్

హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ జాగృతి అధ్యక్షులు, మాజీ ఎంపి కల్వకుంట్ల కవితను కలవడంలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని సిపిఐ ఎంపీ(రాజ్యసభ) పి సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఆహ్వానం మేరకు మర్యాదపూర్వకంగా కలిసినట్టు పేర్కొన్నారు. రాజకీయ, ఇతర అంశాలపై తమ మధ్య చర్చ జరగలేదని స్పష్టం చేశారు. తమ భేటీని తప్పుగా అన్వయించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. తనకు హైదరాబాద్‌లో అనేక మంది రాజకీయ మిత్రులున్నారని వివరించారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా కవిత ఆహ్వానం మేరకు మర్యాదపూర్వకంగా ఆమె ఇంటికి వెళ్లానని పేర్కొన్నారు.

మోడీజీ..వికలాంగులకేది అచ్ఛేదిన్?

- మోసపు హామీలు.. అమలు కాని పథకాలు
- పదకొండేండ్ల పాలనలో అంతా దగా..దగా
- ఆర్ఎస్ఎస్ విధానాలపై దేశవ్యాప్త ఉద్యమం
- ఎన్‌పిఆర్‌డి సదస్సులో జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్


సమావేశంలో మాట్లాడుతున్న మురళీధరన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
'మోడీజీ..మీరన్న అచ్చేదిన్ వికలాంగులకా? కార్పొరేట్లకా? స్పష్టపర్చండి' అని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ డిమాండ్ చేశారు. 'పదకొండేండ్ల బిజెపి పాలన.. వికలాంగులపై ప్రభావం' అనే అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధరన్ మాట్లాడుతూ... మోసపు హామీలు, అమలు కానీ పథకాలతో వికలాంగులను ఇంకెంత కాలం మోసం చేస్తారని ప్రశ్నించారు. పదకొండేండ్ల పాలనలో అదాని, అంబానీలాంటి గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడటం తప్ప.. వికలాంగుల సంక్షేమానికి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. 2014 ఎన్నికల కంటే ముందు వికలాంగుల సంక్షేమనికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన మోడీ ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. పదకొండేండ్లలో వికలాంగుల్లో పేదరికం, నిరుద్యోగం, ఆకలిచావులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద నోట్ల రద్దు, 2020లో విధించిన లాక్‌డౌన్ వారి జీవితాలను అతలాకుతలం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కోసమే ఉన్నామని గొప్పలు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఈ కాలంలో వికలాంగులకు ఏం చేసిందో చెప్పాలని నిలదీశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వికలాంగుల్లో సగం మందికి కూడా యుడిఐడి కార్డులు రాలేదని చెప్పారు. ఎన్నో పోరాటాల ద్వారా వచ్చిన 2016 ఆర్‌పిడబ్ల్యూడి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఇప్పటి వరకు వికలాంగుల కోసం స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేయలేదని చెప్పారు. న్యాయబద్ధమైన వివక్షత ఎదుర్కోవచ్చని చట్టంలో పొందుపర్చటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వికలాంగుల కోసం అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలకు నిధుల కోత పెడుతున్నారని చెప్పారు. సుగమ్య భారత్ అభియాన్ పథకం మోడీ ప్రచారం కోసమే తప్ప వికలాంగుల కోసం కాదన్నారు. అమృత భారత్ రైల్వే స్టేషన్లలో ఎందుకు అవరోధ రహిత వాతావరణం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 2020 నూతన విద్యా పథకం వికలాంగులను చదువులకు దూరం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వికలాంగుల్లో 65 శాతం మందికి ఉపాధి లేదని చెప్పారు. 2012 నుండి ఇందిరా గాంధీ నేషనల్ వికలాంగుల పెన్షన్ రూ. 300 ఇస్తున్నారనీ, ధరల పెరుగుదల సూచికి అనుగుణంగా పెన్షన్ పెంచటంలో ఉద్దేశ పూర్వక నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా ఇందిరా గాంధీ నేషనల్ వికలాంగుల పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో వికలాంగులకు జాబ్ కార్డులివ్వకుండా కేంద్రం కుట్ర చేస్తున్నదని తెలిపారు. 2016 ఆర్‌పిడబ్ల్యూడి చట్టం, నేషనల్ ట్రస్ట్‌లకు చైర్మన్లను నియమించడం లేదని చెప్పారు. రిహాబిలిటేషన్ కౌన్సిల్ అఫ్ ఇండియా చట్టానికి చైర్మన్ నియమించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని నిలదీశారు.

దేశవ్యాప్తంగా ఉన్న తొమ్మిది నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లను విలీనం చేయాలనే ఆలోచనను విరామించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగానే స్టాన్ స్వామి, సాయిబాబా చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఉద్యమం చేయనున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకిచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. పెన్షన్ పెంచకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నదో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ పింఛన్లు మంజూరు చేయాలనీ, 2016 ఆర్‌పిడబ్ల్యూడీ చట్టం ప్రకారం జిల్లా, రాష్ట్ర స్థాయిలో కో-ఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పిఆర్‌డి కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జె రాజు, యశోద, కాశప్ప, గంగాధర్, ఉపేందర్, లింగన్న, స్వామి, అరీఫా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై పోరాడి గెలిచిన సిపిఎం

- ఎనిమిదేండ్లు కోర్టు చుట్టూ తిరిగిన నాయకులు
- ప్రజాపోరాటాల విజయం : రవికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో
వాళ్లంతా ఎర్రజెండా నీడన కార్మిక, కర్షక, పేద ప్రజల పక్షాన పోరాడుతున్న నాయకులు. పోడు రైతుల గొంతుకై పాలకులను ప్రశ్నించారు. పోడు రైతుల పక్షాన పోరాటాలు చేసి.. అటవీ అధికారుల అక్రమ కేసులో జైలుకెళ్లారు. ఈ కేసులో ఎనిమిదేండ్లు కోర్టు చుట్టూ తిరుగుతూ న్యాయం కోసం పోరాడారు. చివరకు కోర్టు ఆ నాయకులను నిర్దోషులుగా పేర్కొంటూ ఈనెల 27వ తేదీ (శుక్రవారం) తీర్పు చెప్పింది. ఇది ప్రజా పోరాటాల విజయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవి కుమార్ తెలిపారు. కోర్టు తీర్పు నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో అందరూ కలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని పోడు భూములు, వాటి సమస్యలపై 2017 జులై 18న అప్పటి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన సిపిఎం నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారు. ఈ కేసుల్లో బండారు రవి కుమార్, ఎస్.సత్యనారాయణ, ఎర్మా పున్నం, కనికరం రాజన్న, పోతు శంకర్, జి.ప్రకాష్, సంకె రవి, మునిమడుగుల బ్రహ్మయ్య, పుట్ట కృష్ణమాచారి ఉన్నారు. ఈ కేసులో ఉన్న ఇద్దరు ఇప్పటికే మృతిచెందారు. సుదీర్ఘ కాలం పోరాటం చేసి కోర్టులో కేసు గెలవడం ఆనందాన్నిచ్చిందని బండారు రవికుమార్ అన్నారు.



గోపీచంద్ అకాడమీలో వెల్నెస్ కో క్లినిక్

ప్రజాశక్తి - హైదరాబాద్
పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీతో భాగస్వామ్యం చేసుకున్నట్లు సమగ్ర ఆరోగ్య సేవలనందించే ది వెల్నెస్ కో వెల్లడించింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా హైదరాబాద్‌లో తమ రెండవ హై-పెర్ఫార్మెన్స్ వెల్నెస్ క్లినిక్‌ను గచ్చిబౌలిలోని అకాడమీలో ప్రారంభించినట్లు తెలిపింది. ఇది తమ సంస్థకు దేశంలో 12వ క్లినిక్ అని ది వెల్నెస్ కో సహ వ్యవస్థాపకుడు రిషబ్ జైన్ తెలిపారు. ఈ క్లినిక్ కేవలం అథ్లెట్ల కోసం మాత్రమే కాదని.. మెరుగైన ఆరోగ్యం, శక్తితో జీవించాలనుకునే ఎవరికైనా ఇది ఒక మార్గదర్శి అని భారత బ్యాడ్మింటన్ జట్టు చీఫ్ నేషనల్ కోచ్ పుల్లెల గోపీచంద్ పేర్కొన్నారు.

కిడ్నీ రోగులకు పింఛన్లు 'నిమ్స్' వైద్యులకు సన్మానం



ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో
నిమ్స్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న 900 మంది కిడ్నీ రోగులు రూ.2,016 నెలవారీ పెన్షన్లు పొందడంలో నెఫ్రాలజీ విభాగం కీలక పాత్ర పోషించింది. అందకు నిమ్స్ నెఫ్రాలజీ విభాగం ప్రొఫెసర్లు భూషణ్ రాజు (నెఫ్రాలజీ విభాగాధిపతి), గంగాధర్, స్వర్ణలత, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్‌ను శనివారం నిమ్స్ కిడ్నీ పేషెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు సన్మానించారు. ఈ పెన్షన్ల మంజూరు కోసం ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి, కిడ్నీ రోగులకు బస్‌పాస్‌లు, పెన్షన్ల ఏర్పాటు, చికిత్సకు ఆర్థిక సహకారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించిన నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.బీరప్ప, ఇతర ప్రొఫెసర్లకు నిమ్స్ కిడ్నీ వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ డి.ప్రభాకర్, ఎస్‌కె.అల్తాఫ్ పాషమియా, జాయింట్ సెక్రెటరీ, కెఎస్.రావు, కోశాధికారి, అసోసియేషన్ సభ్యులు పార్వతి, రఘు, గ్రేస్ పాల్గొన్నారు.

మహిళను మంచానికి కట్టేసి చిత్రహింసలు

- 'తాటికాయల'లో అమానవీయ ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వివాహేతర సంబంధం పెట్టుకుందని ఓ మహిళపై కొందరు వ్యక్తులు అమానవీయంగా దాడిచేసి, వివస్త్రను చేసి అవమానించిన సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. తాటికాయల గ్రామానికి చెందిన మహిళను పదేండ్ల క్రితం ములుగు మండలం బొల్లోనిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ముగ్గురు పిల్లలు. కాగా, సమీప బంధువైన ఓ వివాహితతో ఆమె భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆమెతో కలిసి పది రోజుల క్రితం గ్రామం వెడిచి వెళ్లిపోయాడు. దాంతో ఆయన భార్య ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో గాలింపు చేపట్టి వారి ఆచూకీ తెలుసుకొని గ్రామానికి తీసుకువచ్చారు. వారిద్దరికి గుండు చేసి విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు.

బైక్‌ను ఢీ కొట్టిన ఆర్‌టిసి బస్సు

- నుజ్జునుజ్జయిన వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో
హైదరాబాద్‌లో శుక్రవారం స్కూటీని టిప్పర్ ఢీకొట్టడంతో టైర్ల కింద పడి పసికందు నుజ్జునుజ్జ వ్వగా.. తాజాగా శనివారం బైకును ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాయినవానికుంట గ్రామానికి చెందిన మేకల శంకరయ్య(40) మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో గ్రామం స్టేజీ పక్కన వైన్స్‌షాపు వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. అదే సమయంలో నాగార్జునసాగర్ నుంచి పెద్దవూర వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు బైకును ఢీకొట్టింది. దీంతో శంకరయ్య మృతదేహం నుజ్జునుజ్జయింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి.. మృతదేహాన్ని నాగార్జున సాగర్ కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు వున్నారు. అతని భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ఉద్యోగులకు త్వరలో నూతన ఆరోగ్య పథకం

- దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు : లచ్చిరెడ్డి


మంత్రి రాజనర్సింహను కలిసి ఉద్యోగ జెఎసి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో నూతన ఆరోగ్య పథకం అమల్లోకి రానుందని తెలంగాణ ఉద్యోగ జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఆరోగ్య పథకం లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి వివరించినట్టు తెలిపారు. "రాష్ట్రంలో సరైన ఆరోగ్య పథకం అమల్లో లేదు. దీంతో ఉద్యోగులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డిప్యూటీ తహశీల్దార్ రాజేష్ ఖన్నా ఇటీవల తీవ్ర అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చేరడంతో అతడి కుటుంబం చాలా ఇబ్బందులు పడింది. రాష్ట్రంలో ఏ ఉద్యోగికి అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే తక్షణమే నూతన ఆరోగ్య పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేయాలి" అని మంత్రిని కోరినట్టు లచ్చిరెడ్డి తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఉద్యోగులకు త్వరలో సరికొత్త విధానంతో ఆరోగ్య పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నట్టు ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్టు జెఎసి నేతలు తెలిపారు.

జిపిఒలకు విధులు కేటాయించండి
గ్రామ పాలనా అధికారుల(జిపిఒ)కు క్షేత్ర స్థాయిలో వెంటనే విధులు కేటాయించాలని ప్రభుత్వానికి జెఎసి నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సిపిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్‌ను కలిసి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందించారు. జిపిఒల నియామకాల కోసం ఇప్పటికే అర్హత పరీక్షను నిర్వహించి తుది జాబితాను కూడా వెల్లడించడం జరిగిందని గుర్తు చేశారు. జీపీఓలను విధుల్లోకి తీసుకోవడంతో ఇతర ఉద్యోగులపై ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. అలాగే సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల (అడిషనల్ కలెక్టర్) పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని కోరారు. దీనిపై లోకష్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు రమేష్ పాక, ఎం.రాధ, బాణాల రాంరెడ్డి, వి.భిక్షం తదితరులు ఉన్నారు.

రైతు సంతృప్తిగా ఉన్నప్పుడే రాజ్యం బాగు

- రాబోయే మూడేండ్లలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో
రైతు సంతృప్తిగా ఉన్నప్పుడే రాజ్యం బాగుపడుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాబోయే మూడేండ్లలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నట్టు తెలిపారు. శనివారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌లో భాగంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో రైతు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి పొలంలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో 12 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉంటే.. ఏపీలో ఆరు లక్షల ఎకరాలు, తెలంగాణలో మూడు లక్షల ఎకరాల్లో సాగైందని చెప్పారు. ఆయిల్ పామ్ సాగు కోసం 12.20 ఎకరాలకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నామని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఎన్ని ఎకరాలు సాగుచేసినా ఇస్తామని హామీ ఇచ్చారు. రైతుకు మొక్కల దగ్గర నుంచి మార్కెటింగ్ దాకా ప్రభుత్వం సహకరిస్తున్నదని తెలిపారు. ప్రతి జిల్లాకూ ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సిద్దిపేటలో రిఫైనరీ, ప్యాకింగ్ సహా అతి పెద్ద ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఫ్యాక్టరీలన్నీ ఫ్రీ పొల్యూషన్‌తో ఉంటాయని స్పష్టం చేశారు. పశ్చిమ రంగారెడ్డి ప్రాంతంలో కూరగాయాలు ఎక్కువగా పండిస్తున్నందున, హైదరాబాద్‌కు దగ్గరగా మార్కెట్ చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు అధిక ఆదాయం ఉన్న పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులందరికీ రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో మెగా ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఈ ఒక్క రోజే 557 ఎకరాల్లో ఆయిల్ పామ్ చెట్లు నాటుతున్నట్టు చెప్పారు. జంట నగరాల ప్రజల అవసరాలకు అనుగుణంగా రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు పండించాలని కోరారు. అనంతరం ఆయిల్ పామ్ మొక్కలను నాటి, రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గోనె ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బేగరి రాముడు, మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల గెంటివేత

- పెండింగ్‌లో రూ.154 కోట్ల బకాయిలు
- ప్రారంభమైన 2025-26 అడ్మిషన్ల ప్రక్రియ
- విద్యార్థుల్ని చేర్చుకోలేమంటున్న ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యాలు
- బిల్లులిస్తేనే అడ్మిషన్లు అంటున్న వైనం
- రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల మంది విద్యార్థులు
- ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు కార్పొరేట్ విధ్య మిథ్యేనా



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్ (బిఎఎస్ఎస్)లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మూడేండ్లుగా బిల్లులు అందట్లేదు. ఫలితంగా ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యాలు భారాలు భరించలేమంటూ విద్యార్థుల్ని గెంటేస్తున్నారు. రెసిడెన్సియల్, డే స్కాలర్స్ విద్యార్థుల కోసం ఖర్చు చేసిన డబ్బులు తిరిగి రాకపోవడంతో తామంతా అప్పులు చేయాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. పాత విద్యార్థుల బకాయి బిల్లులు రాకపోవడంతో ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా అడ్మిషన్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 1, 5వ తరగతిలో అడ్మిషన్ల కోసం లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ నెలాఖరులోగా బిల్లులు చెల్లించకపోతే ఎవర్నీ కొత్తగా స్కూల్స్‌లో చేర్చులేమని యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందిస్తామని చెప్పిన ప్రభుత్వాలు నిధుల కేటాయింపుల్లో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నాయంటూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించడంతో పాటు సీట్ల సంఖ్యను పెంచాలని కెవిపిఎస్ డిమాండ్ చేస్తోంది.

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలతో పాటు ఎకస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ప్రత్యేకంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్‌ను అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఏటా 1వ, 5వ తరగతిలో ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పట్టణాల్లోని ప్రయివేట్ పాఠశాలలకు అలాట్ చేస్తారు. 1 నుంచి 5వ తరగతి వరకు డే స్కాలర్స్‌గా 5 నుంచి 10వ తరగతి వరకు రెసిడెన్షియల్ సదుపాయంతో విద్యార్థుల్ని చేర్చుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 250 పాఠశాలల్ని బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎంపిక చేశారు. వీటిల్లో 25 వేల మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతిలో విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి ఏటా ఒక్కో జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్స్ ద్వారా 128, 125 మంది చొప్పున 1వ, 5వ తరగతుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఇంగ్లీష్ మీడియంలో ప్రమాణాలు కలిగిన ప్రయివేట్ స్కూల్స్‌లో ఉచితమైన విద్య, హాస్టల్ వసతి లభిస్తుండటంతో ప్రతి ఏటా అడ్మిషన్ల కోసం ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేస్తున్నారు. బిఎఎస్ఎస్ కింద చదివిన విద్యార్థులు ఉన్నతమైన విద్యను అభ్యసిస్తూ ప్రయోజకులవుతున్నారు. అందుకే ఈ స్కీమ్‌లో సీట్లు వస్తే తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తారు.

పెండింగ్‌లో రూ.154 కోట్ల బకాయిలు

రాష్ట్రంలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో చదవుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రూ.154 కోట్ల నిధులు రావాల్సి ఉంది. ఎన్నికల ముందు గత ప్రభుత్వం కొంత పెండింగ్ పెట్టగా ఈ ప్రభుత్వం వచ్చాక కూడా బిల్లులు చెల్లించలేదు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వాలు అందుకు ఇవ్వాల్సిన నిధుల్ని మాత్రం విడుదల చేయట్లేదు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎంపికైన ఒక్కో విద్యార్థికి రెసిడెన్షియల్ అయితే రూ.42000, డేస్కాలర్ అయితే రూ.28000 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ లెక్కన రాష్ట్రంలో రూ.154 కోట్ల బిల్లులు రావాలి. రెండు మూడు జిల్లాలకు మాత్రం యాజమాన్యాల ఒత్తిడితో బిల్లులు చెల్లించి ఇతర జిల్లాలను విస్మరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖల పరిధిలో రూ.8.50 కోట్ల మేరకు బిల్లులు రావాలి. సంగారెడ్డి జిల్లాలో ఎస్‌సి వెల్ఫేర్ పరిధిలో 12 పాఠశాలల్లో 850 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి రూ.7.5 కోట్ల బకాయిలు ఉన్నాయి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు మరో రూ.1 కోటి వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడేండ్లుగా బిల్లులు చేసి పంపుతున్నా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాని పరిస్థితి ఉంది.

కొత్తగా అడ్మిషన్ల ప్రక్రియ.. నిరాకరిస్తున్న యాజమాన్యాలు

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించే ప్రక్రియను ప్రారంభించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ నెల 20న ఎస్‌సి,ఎస్‌టి సంక్షేమ శాఖల ద్వారా ఒకటవ, ఐదో తరగతిలో అడ్మిషన్ల కోసం లాటరీ తీసి తరగతుల వారీగా విద్యార్థులను ఎంపిక చేశారు. నిర్దేశించిన పాఠశాలకు విద్యార్థులను అలాట్‌మెంట్ చేశారు. ఎంపికైన విద్యార్థులు, తల్లిదండ్రులు సదరు పాఠశాలకు వెళ్లి అడ్మిషన్ల కోరగా చాలా పాఠశాలల యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలో పేరున్న ఒక పాఠశాల యాజమాన్యం కొత్తగా విద్యార్థులను చేర్చుకోవడానికి నిరాకరించింది. మరో కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం ఈ ఏడాది బెస్ట్ అవైలబుల్ స్కీమ్ వద్దని చెప్పడంతో ప్రత్యామ్నాయంగా మరో స్కూల్‌ను ఎంపిక చేశారు. ఎస్‌టి విద్యార్థుల్ని అలాట్ చేసిన మరో పాఠశాల యాజమాన్యం ఏకంగా పాత విద్యార్థులను స్కూల్స్‌ను నుంచి బయటికి పంపింది. విద్యార్థులకు రావాల్సిన ఫీజుల్ని తల్లిదండ్రులు ముందే చెల్లించాలని, బిల్లులు వచ్చాక వాళ్లే తీసుకోండంటూ తేల్చి చెప్పడంతో విద్యార్థులు వీధిన పడ్డారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, ఇతర మెటీరియల్ ఏవీ కూడా బిఎఎస్ఎస్ విద్యార్థులకు ఇవ్వడంలేదు. బకాయిలు రావడట్లేదంటూ కొందరు విద్యార్థుల్ని బయటే నిల్చోబెడుతున్న పరిస్థితి ఉంది.

అప్పులు భరించలేమంటున్న యాజమాన్యాలు

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద విద్యార్థులకు వసతి కల్పించి విద్యనందించడం కోసం అప్పులు చేస్తున్నామంటూ పలువురు స్కూల్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేండ్లుగా విద్యార్థులకు రావాల్సిన బిల్లులు రావట్లేదంటున్నారు. 25 మంది విద్యార్థులున్న పాఠశాలలో వారి కోసం ఏటా రూ.10 లక్షల వరకు బిల్లు రావాలి. అలా మూడేండ్లల్లో రూ.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయంటూ సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రముఖ స్కూల్ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పులు చేసి విద్యను అందిస్తున్నప్పటికీ బిల్లులు సకాలంలో ఇవ్వకపోతే స్కూల్స్ నడపడం కన్నా మూసేయడం మంచిదని ఆయన నిటూర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యాల అసోషియేషన్ బిల్లుల కోసం ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు.

సీఎం చొరవ తీసుకుని బిల్లులు చెల్లించాలి:అశోక్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సంగారెడ్డి

సిఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలి. బిల్లులు రాకపోవడంతో ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను చేర్చుకోవడానికి నిరాకరిస్తున్నాయి. ఇప్పటికే పలు పాఠశాలల్లో విద్యార్థులను బయటికి పంపుతున్నారు. దీంతో విద్యార్థుల చదువులు మధ్యంతరంగా ఆగిపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, కలెక్టర్, మంత్రుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. బడ్జెట్‌లోనే నిధులు కేటాయించి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బిల్లులు చెల్లించాలి.